

# రక్త కుసుమం

సాయి ప్రసాద్

నెలాఖరు రోజులో ఒక సాయంకాలం

నా దగ్గర వున్న లాస్ట్ అండ్ ది లాస్ట్ ఇరవై పైసలకు కాఫీ త్రాగి ఆనంద భవన్ నుంచి బయటకు వచ్చాను.

సెంటర్‌లో చాలామంది జనం ఓ చోట గుమిగూడి ఏదో చూస్తున్నారు. నేనూ ఆ గుంపును తోసుకుంటూ లోనికెళ్ళాను

ఆ జనసమూహం మధ్యగా నేలపై ఒక చిన్న పసికందు అందంగా ఆడుకుంటుంది.

చెట్టునుంచి త్రుంచి పడేసిన పువ్వులా వుంది తన పెద్ద పెద్ద కళ్ళను మూస్తూ తెరుస్తూ చుట్టూ చేరిన పెద్ద మనుషుల్ని ఎక్కిరిస్తున్నది.

తనలో తనే విసుక్కుంటూన్నట్లు ముఖం చిట్లిస్తున్నది. అప్పుడప్పుడు వింతగా ఒళ్ళు విరుచుకుంటున్నది.

ఆ పాపను చూస్తూ ఉన్న వారంతా గోల చేస్తున్నారు.

"ఎవరండీ"

"ఎవడికి" తెలుసు అడ్డమైన పనులు చేసి కడుపు తెచ్చుకోవడం ఆ పాప ఫలితాన్ని ఇలా నడి బజార్లో వదిలేయడం మామూలై పోయింది.

"ఛీ! మనుషుల్లో నీతి నియమాలు చచ్చిపోయాయి"

"దాని తస్సాదియ్యా! నిజాయితీని నిలువునా పాతిపెట్టేశారు గదయ్యా."

"ఈ పసి గుడ్డును ఇలా దార్లో వదిలేసి వెళ్ళి పోవడానికి ఎలా మనసొప్పిందో."

"ఛీ! పాపిష్టి లం.."

"ఏం చేస్తారు. వాళ్ళకే తిండి ఉండదు ఇహ ఇదొక్కటా,"

"ఒళ్ళు తెలీని ఆవేశంలో ఏదో చేస్తారు. అసలు అలాంటి వాళ్ళకి ఇదొక లెఖ్ఖా. ఇదొక లెఖ్ఖటండీ."

"అవునవును. అసలిది ఎన్నో కేసో ఏమో."

"జాలిగుండె కలవాళ్ళం గాబట్టి మనం ఇంత ఇదై పోతున్నాం గానీ అసలు ఈ పాపను వదలేసి వెళ్ళిన వాళ్ళు పీడ విరగడై పోయిందనుకుంటూ ఎక్కడో నిక్షేపంలా ఉంటారు."

వాళ్ళు ఇహ ఎక్కువ మాట్లాడితే తంతాను అన్నట్లు కాళ్ళు జాడించి కళ్ళు మూసుకున్నది పాప

నేను పాప వైపే చూస్తున్నాను. రాను రాను జనంఎక్కువై పోతున్నారు. ఆ పాపను ఏదో వింత జంతువును చూసినట్లు చూస్తున్నారు

నాకు చిన్న ఆలోచన వచ్చింది ఆ పాపను ఇంటికి తీసికెళ్దామని వెంటనే నా చాలీ చాలని గుమాస్తా జీతం గుర్తుకువచ్చి ఆ ఆలోచనను చంపుకున్నాను.

"ఆ కళ్లు అలా ఎంత అందంగా ఉన్నాయో" జనంలో కలకలం ఇంకా సాగుతూనే ఉంది.

ఒక బక్క మనిషి మరో లావు పాటి ఆయన్ని అడుగుతున్నాడు.

"ఈ పాపను కన్నది ఎవరో మనకైతే తెలీదు!

"అవును. తెలీదు." లావుపాటి ఆయన సమాధానం.

"కానీ వాడు ఈగుంపులోనే ఉండొచ్చు."

"అవును బయట పడడానికి సిగ్గుపడి ఉండొచ్చు ఇంకో పొట్టి మనిషి వీళ్లద్దరి మాటలు వింటూ నాయకుడిలా అరిచాడు.

"మీలో ఎవరైనా ఈ పాప తండ్రి అయి ఉంటే నిర్భయంగా ఒప్పేసుకోండి సిగ్గు పడాల్సిన అవసరం. ఏమిలేదు. మేమేమి అనుకోం"

"పైగా పూలమాల వేసి సత్కరిస్తాం" అందుకున్నాడు ఇంకో కాయన

"చందాలు పోగుచేసి డబ్బిస్తాం" [illegible] వినిపించనంత మెల్లిగా సణిగాడు మరొకడు.

"ఊ కమాన్ కమాన్ రా ముందు" మరో వైట్ పాంట్.

"మేము మంచివాళ్ళం గాబట్టి నీకు ఈ అవకాశం ఇప్పిస్తున్నాం" ఈ పాప తల్లి దండ్రులు "ఎవరైనా వచ్చేసేయండి ముందుకు" మళ్ళీ అరిచాడు నాయకుడు.

కానీ ఎవరూ రాలేదు.


ఐదు నిమిషాలు ఎవరూ మాట్లాడేదు ఎవరైనా ముందుకు వస్తారా అని ఆశతో చూస్తున్నారు.

ఒక వ్యక్తి జనాన్ని తోసుకుంటూ వచ్చాడు గానీ అతను వీళ్ళ చందాలు పోగు చేసుకోడానికి, వీళ్ళ పూల మాలలు స్వీకరించడానికి వచ్చినవాడు గాదు వీళ్ళ కేకలు విని ఏదైనా దొరుకుతుందని ఆశపడి వచ్చిన పోలీసు.

ఎర్రటోపి

చేతిలో లాఠీ

"ఏంటి కథ" అడిగాడు పాపను చూస్తూ.



చెప్పారు

"ఓహో" నీరుగారిపోయాడు పోలీస్

"ఇంతేనా."

లావుపాటి మనిషి పోలీస్‌ను చూసి తెగ మురిసిపోతూ అన్నాడు.

"అమ్మయ్య మీరొచ్చారు. తీసికెళ్ళండి బాబూ"

పోలీసు క్షణం తంగాటు పడి మళ్ళా తేరుకుని అన్నాడు.

"అది నా డ్యూటీగాదు"

"ఇందులో డ్యూటీ ఏమిటి? మానవత్వం."

"అయ్యా, నా కవతల డ్యూటీకి టైమయింది నన్ను పోనివ్వండి బాబో."

"చూడండి పోలీసుగారూ...."

"ఏం టయ్యా, చూసేది. నువ్వు చూపించగూడదూ మానవత్వం."

"బాబ్బాబు మీరలా అనకండి"

"ఆ కళ్ళు చూడండి ఎలా మెరుస్తున్నయో"

"ఆ నోరు చూడండి బుజ్జినోరు"

"ఆ బుగ్గల్కి-దేఖో, కైసా సొట్ట పడ్తున్నయ్యో"

ఈసారి పోలీసుకు కోపం వచ్చింది.

"అయితే దీన్ని స్టేషన్‌కు తీసుకుని పోయి ఎస్. ఐ తో చివాట్లు తినమంటారు బాల్బాలు. నే బోతున్నా" అంటూ జనసమూహాన్ని చీల్చుకుంటూ బయటకు నడిచాడు

పోలీసు

అతను వెళ్ళడంలో జనం మళ్ళీ సందిగ్ధంలో పడ్డారు

"అయితే ఏం చేద్దాం" అన్నాడొకడు.

"అవును: ఏదో ఒకటి చేయాల్సిందే! మనం ఇంత మందిమి ఉండి. ఈ చిన్న ప్రాణిని రక్షించలేమా'. నాయకుడు అన్నాడు

"ఓహో! ఇట్ ఈజ్ వెరీ ఈజీ" టైట్ పాంట్.

"అంత ఈజీ అయితే తమరే తీసికెళ్ళకూడదూ"

"ఓ.... స్సారీ! నేను కేర్ ఫ్రీ గాడిని ఈపాప నా దగ్గరవున్నా ఈ రోడ్ మీదున్నా ఒకటే. మీరే తీసుకెళ్ళి పెంచుకోండి"

నాయకుడు సర్దుకున్నాడు.

"అమ్మమ్మ .... నేనా. నాకు యిప్పటికే ఎనిమిదిమంది వున్నారు అష్టగ్రహాల్లా"

"మీరు తీసికెళ్ళండి సుబ్బారావుగారూ! మీకు పిల్లలు లేరుగదా." అడిగింది ఒక కూరగాయల సంచీ

ఆ సుబ్బారావుకు నోట్లో పచ్చివెలక్కాయ పడినట్లైంది.

"అవి నిజమేననుకోండి. కానీ నా అక్క కొడుకును పెంచుకుందామనుకుంటున్నానే!"

"మీ అక్కకు గూడా ఒకడే కొడుకు కదటండీ పైగా చాలా ఆస్తి ఉంది గూడాను"

"అవుననుకోండీ...." నసిగాడు సుబ్బారావు

"అసలు నేనే తీసికెళ్దును మా ఆవిడ మహంకాళి మీద పడి కరచేస్తుంది" ఇంకెవరూ తనను అడక్కముందే జాగ్రత్తపడి చెప్పేశాడు కూరగాయల సంచీ.

వీళ్ల మాటలు వింటున్నట్లు పాప కళ్లు మూసుకుని తనలో తను నవ్వుకుంటున్నది.

జనం ఒక్కొక్కరే వెళ్లిపోయారు.

మరో కొన్నిక్షణాల్లో అందరూ వెళ్లిపోయారు నేనొక్కడినే పాపకెదురుగా మిగిలాను.

ఆ పాపను చూస్తున్న కొద్దీ నాకేదో ఆప్యాయత కలిగింది. నేను మాత్రం ఏం చేయగలుగుతాను?

ఆ పాప మిదికి వంగి తలపై చేత్తో నిమిరాను నా భుజం మీది గుడ్డతీసి ఆ పాప మీద కప్పి లేచాను

తెల్లవారేలోగా ఏ దేవుడో కరుణించడా? ఏ మానవుడికైన దయకలిగి ఈ పసిపాపను కనీసం అనాథ శరణాలయంలో చేర్పించడా? అనుకుంటూ ఇంటదారిపట్టాను. తెల్లవార్లూ నాకు నిద్రపట్టలేదు ఎందుకు భగవంతుడు ఇంత నిర్దయగా ప్రవర్తిస్తుంటాడు ఎవ్వరికీ పనికిరాని ఆ శిశువుకు అంత అందం ఎందుకు! ఏంచేసుకోను?

తెల తెల వారుతూనే నా మనసు మళ్లీ ఆ పాపపైకి వెళ్లింది. వెంటనే ఆ స్థలానికి వెళ్లాను. అక్కడ పాప లేదు. కానీ ....

కానీ సరిగ్గా అదే స్థలంలో నాకుకనపడిన దృశ్యాన్ని చూసి స్థాణువులా నిలబడిపోయాను నా కాళ్ళక్రింద భూమి కదిలింది. నరాల్లోకి రక్తం జివ్వుమని ప్రవహించింది ప్రపంచమంతా నిర్జీవంగా నిస్సారంగా కనబడింది.

నేను ఆ పాపకు కప్పిన గుడ్డ రక్తసిక్తమై ముక్కలు ముక్కలుగా చినిగిపోయి ఉంది.

ఆ స్థలమంతా రక్తం ఆరిపోయి కరుడుగట్టి భయంకరంగా ఉన్నది

ఆ భీకర దృశ్యాన్ని ఇక చూడాలేక వెనక్కి తిరిగాను.

కల్లబొల్లి కబుర్లు చెప్పే ఈ మనుషులూ, ఆ దేవుడూ చేయలేని సాయాన్ని ఆ పసిపాపకు వీధి కుక్కలు చేసి పెట్టాయి.